సాక్షి
చిత్తూరు
సోమవారం । 23 । అక్టోబర్ । 2023



కాణిపాకంలో మహాచండీ యాగం

కాణిపాకంలోని శ్రీకాళికామాత ఆలయంలో ఆదివారం మహాచండీ యాగం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

- IIలో



ఖోఖో రాష్ట్ర విజేత ప్రకాశం

రాష్ట్ర స్థాయి బాల, బాలికల ఖోఖో పోటీల విజేతలుగా ప్రకాశం, తూర్పు గోదావరి జట్లు నిలిచాయి.

- IIలో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	34	21
తిరుపతి	36	22
తిరుమల	31	18
గూడూరు	33	23
నగరి	36	22

న్యూస్‌రీల్

అయిగిరి నందిని..నందిత మేదిని



మహిసురమర్థిని అలంకారంలో అమ్మవారు

చౌడేపల్లె: కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా విరాజిల్లుతున్న బోయకొండ శ్రీగంగమ్మ ఆలయంలో దసరా శోభ ఉట్టిపడింది. దసరా శరన్నవ రాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం శత్రుసంహారిణి మహిషాసురమర్ధిని అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. భక్తిశ్రద్ధలతో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తన్మయత్వం చెందారు. తొలుత వేద పండితులు గోవర్ధనశర్మ, విశ్వనాథశర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, స్వస్తివాచనం, దేవనాంది, గణపతిహోమం, చండీహోమం నిర్వహించారు. అమ్మవారికి అభిషేక పూజల అనంతరం పరిమళభరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. అమ్మవారి ఉత్సవమూర్తిని సైతం ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. దేవస్థానం చైర్మన్ నాగరాజరెడ్డి, ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలను అందజేశారు. ఆదివారం కావడంతో భక్తులు అశేష సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. మహోత్సవాల్లో చివరి రోజు సోమవారం రాజరాజేశ్వరిదేవిగా అమ్మవారు దర్శనమిస్తారని ఈఓ చంద్రమౌళి తెలిపారు.

కాణిపాకం గోశాలకు రెండు ఆవులు



దేశీయ ఆవులతో దాతలు, అధికారులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం గోశాలకు విజయవాడ దయాన ఫౌండేషన్‌కు చెందిన రఘు గురూజీ మిత్రబృందం రెండు నాటు(దేశీయ) ఆవులను కానుకగా అందించారు. ఆదివారం సాయంత్రం ప్రత్యేక వాహనంలో వాటిని కాణిపాకం ఆలయం వద్దకు తీసుకొచ్చి దేవస్థానం ఈఓ వెంకటేశుకు అప్పగించారు. అలాగే వాటి పోషణకు రూ.20 వేలు విరాళంగా అందించారు. వారికి ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి, తీర్థ ప్రసాదాలు అందించారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన రద్దు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించాల్సిన స్పందన కార్యక్రమం రద్దు చేసినట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం ప్రభుత్వ సెలవు దినం కావడంతో స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించాలని కోరారు.

నేటి పోలీసు స్పందన రద్దు

చిత్తూరు అర్బన్: చిత్తూరులో సోమవారం నిర్వహించాల్సిన పోలీసు స్పందన కార్యక్రమం రద్దు చేసినట్లు ఎస్పీ రిషాంత్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. విజయదశమి పర్వ దినం నేపథ్యంలో స్పందన నిర్వహించడం లేదని పేర్కొన్నారు. అలాగే మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించాల్సిన స్పందన కూడా రద్దు చేసినట్లు కమిషనర్ అరుణ తెలిపారు.

వినాయకుని సేవలో హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ వెంకటరమణకు చిత్రపటం అందిస్తున్న చైర్మన్, ఈఓ

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటరమణ ఆదివారం దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆయన కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేయగా దేవస్థానం చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనం చేయగా, స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలను చైర్మన్, ఈఓ అందించారు. చిత్తూరు జిల్లా కోర్టు న్యాయమూర్తులు, కాణిపాకం ఎస్‌ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.



అశేష భక్తజన సందోహం నడుమ స్వర్ణరథోత్సవం



అశ్వవాహనంపై ఊరేగుతున్న శ్రీవారు

కల్కి కటాక్షం



తనువును పులకరింపజేసే మలయమారుతాలు.. మనసుని పరవశింపజేసే గోవిందనామాలు.. ఆధ్యాత్మికానుభూతిని ఇనుమడింపజేసే జీయ్యంగార్ల గోష్టిగానాలు.. శ్రవణానందకరంగా మంగళవాయిద్యాలు.. కనులపండువగా కళాబృందాల నృత్యాభినయాలు.. ఠీవిగా ముందు కేగుతున్న గజరాజులు.. అడుగడుగునా కర్పూర హారతుల నడుమ ఉభయదేవేరీ సమేతంగా మలయప్పస్వామివారు దర్శనమిచ్చారు. స్వర్ణరథంపై దివ్యతేజోవిరాజితంగా దేవదేవుడు విహరిస్తూ భక్తులకు సకల శుభాలను అనుగ్రహించారు. కలి దోషాలను నివారించే కల్కి అవతారంలో అశ్వవాహనం అధిరోహించి సమస్త జీవకోటిని కటాక్షించారు.

- వైభవంగా శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు
- స్వర్ణరథంపై ఊరేగిన సర్వాంతర్యామి
- అశ్వవాహనంపై విహరించిన అనంతతేజోమూర్తి
- నేడు చక్రస్నానం.. సర్వం సిద్ధం

తిరుమల : తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. ఎనిమిదోరోజు ఆదివారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీమలయప్పస్వామివారు స్వర్ణరథంపై ఊరేగారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు, కళాబృందాల ప్రదర్శనల నడుమ మాడవీధుల్లో విహరించారు. ఈ క్రమంలోనే రాత్రి 7 నుంచి 9 గంటల వరకు కనులపండువగా అశ్వవాహన సేవ నిర్వహించారు. శ్రీవారు కల్కి అలంకారంలో అశ్వంపై కొలువుదీరి భక్తజనులను అనుగ్రహించారు. వాహన సేవల్లో టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ఏవీ ధర్మారెడ్డి పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న ఉత్సవాలు

శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు సోమవారం ఉదయం స్నపన తిరుమంజనం, చక్రస్నానం, రాత్రి ధ్వజారోహణంతో పరిపూర్ణంకానున్నాయి.

చక్రస్నానానికి ఏర్పాట్లు పూర్తి

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 6 నుంచి 9 గంటల వరకు వరాహస్వామివారి ఆలయం వద్ద పుష్కరిణిలో ముందుగా శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామివారికి, చక్రత్తాళ్వార్‌కు స్నపనతిరుమంజనం జరిపించనున్నారు. అనంతరం శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించనున్నారు. ఈ క్రమంలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అధికారులు సర్వం సిద్ధం చేశారు.



స్వర్ణరథోత్సవంలో టీటీడీ బోర్డు చైర్మన్ భూమన, ఈఓ ధర్మారెడ్డి



మహిషాసురమర్థినిగా కళాకారిణి అభినయం




ఏడుకొండలవాని వైభవాన్ని చాటుతూ కళా ప్రదర్శన

పర్యావరణహితంగా దశమి వేడుకలు



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



డిప్యూటీ సీఎం నారాయణస్వామి



మంత్రి రోజా



కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : పర్యావరణహితంగా జిల్లా ప్రజలు విజయదశమి వేడుకలు జరుపుకోవాలని డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్‌కే రోజా కోరారు. ఆదివారం వారు మాట్లాడుతూ దుర్గామాత ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అదే విధంగా ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్ షణ్మోహన్, జేసీ శ్రీనివాసులు తదితరులు జిల్లా వాసులకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.

గవర్నర్‌కు సాదర వీడ్కోలు



గవర్నర్‌కు వీడ్కోలు పలుకుతున్న అధికారులు

రేణిగుంట : రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఆదివారం రేణిగుంట విమానాశ్రయంలో అధికారులు సాదర వీడ్కోలు పలికారు. రెండు రోజుల పర్యటన ముగించుకుని తిరుగుప్రయాణమైన గవర్నర్‌కు కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వరరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, తహసీల్దార్ ఉదయ్‌సంతోష్ తదితరులు వీడ్కోలు పలికారు. అనంతరం ఆయన బెంగుళూరుకు బయలుదేరి వెళ్లారు.

బస్సు యాత్రతో ప్రజలకు మరింత చేరువ



సమావేశంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీలు భరత్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

'రాజ్యాధికారం అన్ని వర్గాలకు అందించాలన్న ధ్యేయంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పని చేస్తోంది.. అన్ని ప్రధాన పదవులు వెనుకబడిన వర్గాలకు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుంది. ప్రజలకు జరిగిన మేలును వివరించడమే బస్సు యాత్ర ఉద్దేశం' అని డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. నవంబరు 2న చిత్తూరులో బస్సుయాత్ర ఖరారు అయిన నేపథ్యంలో ఆదివారం ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. సామాజిక బస్సు యాత్ర విజయవంతంపై పార్టీ క్యాడర్‌కు దిశా నిర్దేశం చేశారు.

- జరిగిన మేలును వివరించడమే ఉద్దేశం
- ఎన్నికల హామీలను పూర్తిగా నెరవేర్చాం
- సామాజిక న్యాయం చేసింది సీఎం జగన్ మాత్రమే
- 2న చిత్తూరులో బస్సు యాత్ర
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను పూర్తిగా నెరవేర్చామని, జరిగిన అభివృద్ధిని, సంక్షేమ లబ్ధిని ప్రజలకు వివరించాలని డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లాలోని 7 నియోజకవర్గాల్లో అభివృద్ధి, సంక్షేమం పరుగులు తీస్తోందని ప్రజల అభిమానంతో అన్ని చోట్ల గెలుపు తథ్యమని పేర్కొన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థలు, నవరత్న పథకాలతో ప్రజల ముంగిటకే పాలన వచ్చిందన్నారు. జిల్లాలో చిత్తూరు నియోజకవర్గంలో నవంబరు 2న యాత్ర జరుగుతుందని, అందుకు తగ్గట్టుగా పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని సూచించారు.

చరిత్రకు నాంది

దేశ చరిత్రలో బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి పెద్దపీట వేసిన ఏకైక నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని డిప్యూటీ సీఎం నారాయణస్వామి. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. బీసీ డిక్లరేషన్‌తో సరికొత్త చరిత్రకు నాంది పలికినట్లు పేర్కొన్నారు. అణగారిన వర్గాల బతుకుల్లో వెలుగులు నింపి రాజకీయ, సామాజిక, విద్య, ఆర్థిక పరంగా ఎదుగుదలకు ఎన్నో అవకాశాలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కల్పించిందన్నారు. ఒకప్పుడు ప్రభుత్వ పథకాల కోసం అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరగేవారని, వైఎస్సార్‌సీపీ అధికారంలో వచ్చాక అర్హత ఉంటే ఇంటి వద్దకే పథకాలు అందుతున్నాయని తెలిపారు. జరిగిన మేలును ప్రజలకు చెప్పేందుకు బస్సు యాత్ర ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకొని జయప్రదం చేయాలని కోరారు. ప్రతి ఎమ్మెల్యే తమ పరిధిలో యాత్రను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీ రెడ్డెప్ప, పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ భరత్, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసుల, ఎంఎస్‌బాబు, వెంకటేగౌడ, జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి, కార్పొరేషన్ చైర్‌పర్సన్లు వనిత, శాంతి, చైర్మన్ కుమారరాజా, నియోజకవర్గ పరిశీలకులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్ర పోటీలు ప్రారంభం



బాల్ బాడ్మింటన్ కోర్టు ప్రారంభిస్తున్న మంత్రి ఆర్కేరోజా

- 13 ఉమ్మడి జిల్లాల నుంచి విచ్చేసిన క్రీడాకారులు
- ప్రారంభించిన క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా

నగరి: పట్టణంలోని కేవీకే మైదానంలో ఆదివారం 8వ బాల్ బ్యాడ్మింటన్ మూడు రోజుల రాష్ట్ర స్థాయి పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పోటీల ఆర్గనైజింగ్ చైర్మన్ అయిన రాష్ట్ర పర్యాటక, క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జాతీయ పతాకంతో పాటు, రాష్ట్ర, జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ పతాకాలను ఎగురవేశారు. అనంతరం 13 జిల్లాల నుంచి విచ్చేసిన క్రీడాకారులను ఆయా జిల్లాల విశిష్టతను వివరిస్తూ ఆహ్వానించగా వారు పరేడ్ నిర్వహిస్తూ మంత్రికి గౌరవ వందనం చేశారు. అనంతరం పోటీలకు సిద్ధం చేసిన బాల్ బ్యాడ్మింటన్ కోర్టులను మంత్రి రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని వారిని ఉత్సాహపరచడం ఎనలేని ఆనందాన్ని నింపింది. పెద్ద ఎత్తు న పోటీలు నిర్వహించి క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారంటూ 'థ్యాంక్యూ మేడమ్' అన్న ప్లకార్డులు చూపడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

నగరిలో క్రీడా సందడి

తొలిసారిగా నగరి రాష్ట్రస్థాయి పోటీలకు వేదిక కావడం ప్రత్యేకత సంతరించుకుంది. బ్యాండు వాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల సందడి నడుమ పోటీలు ప్రారంభమయ్యాయి. సంస్కృతిని ప్రతిబింబిస్తూ చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా విచ్చేసిన క్రీడాకారులు, కోచ్‌లు, పీడీలతో మైదానం కళకళలాడింది.

ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోంది

బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు విజయశంకర్ రెడ్డి, వెంకటరావ్ మాట్లాడుతూ క్రీడలకు ప్రభుత్వం ఎంతో ప్రోత్సాహాన్ని అందిస్తోందన్నారు. ఇటీవల ఆసియా క్రీడల్లో గెలుపొందిన వారికి, జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్‌లో విజేతగా నిలిచిన జట్టుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించిందన్నారు. ఇందుకుగాను క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజాకు కృతజ్ఞతలు తెలిపారు. బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వెంకటస్వామి, కార్యదర్శి బాలాజీ, ఉపాధ్యక్షుడు గోపి, జాయింట్ సెక్రటరీ, సుధాకర్, ట్రెజరర్ రాజేష్, అడ్వైజర్ జయరామయ్య శెట్టి, డీఎస్‌ఏ చీఫ్ కోచ్ బాలాజీ, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సురేష్‌బాబు, శాప్‌కోచ్ బాబు, అసోసియేషన్ నగరి చైర్మన్ ఎంవీ రవిబాబు, మోహన్, కార్యదర్శి నిజాం, పీడీలు చంద్ర, మణి, ప్రకాష్, లోకేష్, హేమాద్రి, సుబ్బు, కుమార్ పాల్గొన్నారు.



వివిధ జిల్లాల నుంచి హాజరైన క్రీడాకారులు

● దసరా వచ్చిందయ్యా..



వీ.కోట శ్రీదుర్గామాత ఆలయ నవరాత్రి ఉత్సవాల్లో దుర్గాష్టామి సందర్భంగా ఆదివారం అమ్మవారిని 2వేల కలశాలతో తీసుకువచ్చిన పాలతో అభిషేకం చేశారు. మహిళలు క్షీర కలశాలతో శోభాయాత్రగా ఆలయానికి రావడం ముందే విజయదశమి వచ్చిందా అన్న విధంగా పట్టణంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఎంపీపీ యువరాజు.



సర్పంచ్ పీఎన్ లక్ష్మి దంపతులు భక్తులతో పాటు వచ్చి సారె సమర్పించారు. జై మాత.. జైజై మాత నామస్మరణలు మిన్నంటాయి.

- వీ.కోట

డీఆర్‌ఓగా శ్రీనివాస్

- పలువురు ఆర్డీఓల బదిలీ



శ్రీనివాస్,డీఆర్‌ఓ



రాజశేఖర్ డ్వామా పీడీ

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు డీఆర్‌ఓగా శ్రీనివాస్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డి జీవో 2072 జారీచేశారు. ఆ జీవో మేరకు నంద్యాల నుంచి శ్రీనివాస్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్.రాజశేఖర్‌ను చిత్తూరు డ్వామా పీడీగా, కలెక్టరేట్ కేఆర్‌ఆర్‌సీ (కోనేరు రంగారావు కమిటీ)డిప్యూటీ కలెక్టర్‌గా డి. తిప్పేనాయక్‌ను నియమించారు. చిత్తూరు ఆర్‌డీవోగా పనిచేస్తుండిన రేణుకను చిత్తూరు సివిల్ సప్లైస్‌విజిలెన్స్ ఆఫీసర్‌గా, పలమనేరు ఆర్‌డీవో శివయ్యను చిత్తూరు జిల్లా డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డీపీఎంగా నియమించారు. బదిలీ అయిన వారు వెంటనే నూతన స్థానాల్లో విధుల్లో చేరాలని ఆ ఉత్తర్వుల్లో సూచించారు.

ముక్కంటి ఆలయంలో ఆయుధపూజ

శ్రీకాళహస్తి : శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం శ్రీకాళహస్తీశ్వరాలయంలో శాస్త్రోక్తంగా ఆయుధపూజ నిర్వహించారు. స్వామివారి నవగ్రహ కవచం, అమ్మవారి స్వర్ణవస్త్రం, ఆయుధాలను నిత్య కల్యాణ మండపంలో కొలువుదీర్చారు. అనంతరం ఆయుధాలను శుద్ధి చేసి, పసుపు, కుంకుమ, చందనం, సుగంధ పుష్పాలతో అలంకరించారు. ధూపదీప నైవేద్యాలతోపాటు పంచ హారతులు సమర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.



ఆయుధాలకు పూజ నిర్వహిస్తున్న వేద పండితులు

క్లుప్తంగా

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు


గాయపడిన సుధాకర్

సోమల: మండలంలో ఆదివారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు ..మండల కేంద్ర సమీపంలోని దళితవాడకు చెందిన సుధాకర్(39) సొంత పనుల నిమ్మిత్తం ద్విచక్ర వాహనంలో సదుంకు వెళ్తుండగా మార్గ మధ్యంలో ప్రమాదవశాత్తు అదుపుతప్పి కిందపడ్డాడు. ఈఘటనలో సుధాకర్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతన్ని ఆస్పత్రికి తరలించారు.అలాగే రాజీవ్ నగర్ కాలనీ వద్ద కల్లూరు నుంచి చౌడేపల్లె వైపు నిత్యావసర సరుకులతో వెళ్తున్న లగేజీ వాహనం టైర్ పగలడంతో అదుపు తప్పి బోల్తా పడింది. వాహనంలో ఉన్న సరుకులు నేలపాలయ్యాయి. ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు పీహెచ్‌సీకి తరలించారు.

ఖోఖో రాష్ట్ర విజేత ప్రకాశం


మొదటి స్థానంలో నిలిచిన ప్రకాశం జిల్లా బాలుర జట్టు


బాలికల విభాగంలో మొదటి స్థానంలో నిలిచిన తూర్పు గోదావరి జిల్లా జట్టు

- బాలికల విభాగంలో తూర్పు గోదావరి విన్నర్
- యాదమరిలో అట్టహాసంగా ముగిసిన పోటీలు

యాదమరి: పూతలపట్టు నియోజకవర్గం యాదమరి జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో జరుగుతున్న మూడు రోజుల రాష్ట్ర స్థాయి జూనియర్స్ బాల, బాలికల ఖోఖో పోటీల విజేతలుగా ప్రకాశం , తూర్పుగోదావరి జట్లు నిలిచాయి. 13 జిల్లాల నుంచి 13 బాలుర జట్లు, 13 బాలికల జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. మూడు రోజుల పాటు పోటీలు రసవత్తంగా జరిగాయి. ఫైనల్స్‌లో బాలుర విభాగంలో ప్రకాశం జిల్లా జట్టు మొదటి స్థానం, విజయనగరం జిల్లా రెండవ, విశాఖపట్నం,


రెండవ స్థానంలో నిలిచిన ప్రకాశం జిల్లా బాలికల జట్టు

కర్నూలు జిల్లా జట్లు మూడవస్థానంలో నిలిచాయి. బాలికల విభాగంలో తూర్పుగోదావరి జిల్లా మొదటి స్థానంలో, ప్రకాశం జిల్లా రెండవ స్థానంలో, వెస్ట్ గోదావరి, నెల్లూరు జిల్లాల జట్లు మూడవస్థానంలో నిలిచాయి. గెలుపొందిన జట్లకు పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్‌బాబు, జెడ్పీ వైస్ చైర్మన్ ధనుంజయరెడ్డి బహుమతులను అందించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్, బీఎంఆర్ సంస్థల అధినేత మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీలు ఇక్కడ నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వం క్రీడాభివృద్ధికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని తెలిపారు. గెలుపొందిన జట్ల క్రీడాకారులను అభినందించారు. ఖోఖో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, కార్యదర్శి శరత్‌కుమార్, నిర్వాహకులు సురేష్, విక్రమ్, పీడీలు సురేష్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కాణిపాకంలో మహాచండీ యాగం


దుర్గాదేవి అలంకరణలో అమ్మవారికి పూజలు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వెలసిన శ్రీకాళికామాత ఆలయంలో దసరా మహోత్సవాల్లో భాగంగా ఆదివారం మహాచండీ యాగం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాణిపాకం శ్రీవర సిద్ధి వినాయకస్వామి దేవస్థానం తరపున చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు సారెను సమర్పించారు. కాళికామాత ఆలయ ధర్మకర్త, కాణిపాక సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి వాటిని స్వీకరించారు. వాటిని అమ్మవారికి అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చైర్మన్, ఈఓకు తీర్థ ప్రసాదాలు అందించారు. అంతకు ముందు మహా చండీయాగం పూర్ణాహుతి పూజల్లో చైర్మన్, ఈఓ పాల్గొన్నారు. రాత్రి అమ్మవారిని దుర్గాదేవిగా


సారె సమర్పిస్తున్న ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు

అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు.

టీడీపీ కార్యకర్తలను అడ్డుకున్న ఇద్దరి అరెస్టు

- ఓ నిందితుడిపై రౌడీషీట్ నమోదుకు ప్రతిపాదన
- ఫిర్యాదు లేకున్నా.. సుమోటాగా కేసు నమోదు
- రాజకీయాలతో పోలీసులకు సంబంధం లేదు
- మీడియా సమావేశంలో చిత్తూరు ఎస్పీ రిషాంత్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: పుంగనూరులో టీడీపీ కార్యకర్తలను అడ్డుకున్న ఘటనలో పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందకున్నా.. సుమోటాగా కేసు నమోదుచేసి ఇద్దరిని అరెస్టు చేసినట్లు చిత్తూరు ఎస్పీ వై.రిషాంత్‌రెడ్డి తెలిపారు. ఆదివారం చిత్తూరు పోలీసు అతిథిగృహంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ శ్రీకాకుళం నుంచి సైకిల్ యాత్రపై వచ్చిన ఇద్దరు పార్టీ కార్యకర్తలను అడ్డుకున్న ఘటనలో పుంగనూరుకు చెందిన


మాట్లాడుతున్న ఎస్పీ రిషాంత్‌రెడ్డి

సురేష్ (40), శివ (44)ను అరెస్టు చేశామని, వినయ్ అనే మరో నిందితుడి కోసం గాలిస్తున్నామన్నారు. దీనిపై బాధితుల నుంచి ఫిర్యాదు లేకున్నా.. టీవీలు, పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా పుంగనూరు పోలీసులను విచారణకు ఆదేశించామన్నారు. మద్యం మత్తులో ఉన్న సురేష్, శివ, వినయ్ ఈ చర్యకు పాల్పడినట్లు గుర్తించామని తెలిపారు. సురేష్‌పై రౌడీషీట్ తెరవడానికి ప్రతిపాదనలు వచ్చాయని, ఈ మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసులకు రాజకీయ పార్టీలతో ఎలాంటి సంబంధం ఉండదని.. చట్టాన్ని ఎవరైనా చేతుల్లోకి తీసుకుంటే వారికి న్యాయస్థానంలో శిక్ష పడేలా పోలీసుశాఖ వ్యవహరిస్తుందన్నారు. కొందరు వ్యక్తులు దీన్ని రాజకీయం చేయాలని చూస్తున్నారన్నారు.

ప్రణాళికతోనే టీడీపీ పుంగనూరులో అల్లర్లు

గతంలో పుంగనూరులో జరిగిన అల్లర్లను ఈ ఘటనకు లింకు పెడుతున్నారని.. నాలుగు నెలల కిందట పుంగనూరులో జరిగిన అల్లర్లలో 2 కిలోమీటర్ల దూరంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఎక్కడా లేరని ఎస్పీ స్పష్టం చేశారు. టీడీపీ నేతలు పట్టణాన్ని విధ్వంసం చేయాలనే ప్రణాళికతో పోలీసులపై దాడులకు తెగబడ్డారన్నారు. చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ జిల్లాలో పలుచోట్ల కొవ్వొత్తుల ర్యాలీలు, నిరసనలు వ్యక్తం చేస్తున్నా పోలీసుశాఖ ఎలాంటి అభ్యంతరం వ్యక్తం చేయడం లేదని గుర్తు చేశారు. ఎవ్వరికైనా భావ ప్రకటన వ్యక్తపరచే స్వేచ్ఛ ఉంటుందన్నారు. ఇదే సమయంలో ఏదైనా కార్యక్రమం చేసేప్పుడు పోలీసులకు సమాచారం ఇస్తే.. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా రక్షణ కల్పించేందుకు వీలవుతుందనే విషయం గుర్తించుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ సుధాకర్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

గాయపడిన బాలిక మృతి


యశ్విని మృతదేహం

పెనుమూరు(కార్వేటినగరం): కలిగిరికొండ రెండో మలుపు వద్ద శనివారం ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో గాయపడిన బట్టుకంద్రిగకు చెందిన వెంకటేశ్‌రెడ్డి కుమార్తె బాలిక యశ్విని(17) ఆదివారం మృతి చెందింది. ఈ ఘటనలో డ్రైవర్‌తో సహా 8 మంది గాయపడిన విషయం తెలిసిందే. తీవ్రంగా గాయపడిన యశ్వినికి చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం వేలూరు సీఎంసీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అక్కడ మృతి చెందింది.తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అనికుమార్ తెలిపారు. కాగా బాలిక మృతితో బట్టుకంద్రిగ గ్రామంలో విషాదం నెలకొంది.

తమిళనాడు బియ్యం సీజ్.. ఒకరి అరెస్టు

చిత్తూరు అర్బన్: తమిళనాడు నుంచి బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని చిత్తూరు పోలీసులు అరెస్టు చేశారు. టూటౌన్ ఎస్ఐ నాగరాజు కథనం మేరకు.. చిత్తూరు రెవెన్యూ అధికారులు ఆదివారం చిత్తూరు–బెంగళూరు బైపాస్ వద్ద తనిఖీలు చేపట్టారు. బొలేరో వాహనాన్ని తనిఖీ చేయగా పెద్ద ఎత్తున బియ్యం బస్తాలు కనిపించాయి. మొత్తం 4030 కిలోల బియ్యాన్ని గుర్తించి సీజ్ చేసిన అధికారులు.. పోలీసులకు అప్పగించారు. బొలెరోలో ఉన్న బెంగళూర్ కు చెందిన రఘు (27) అనే వ్యక్తిని అరెస్టు చేశారు. వాహనం సహా బియ్యాన్ని సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

బాలిక ఆత్మహత్య

చిల్లకూరు : స్థానిక మిక్సెడ్ కాలనీలో ఆదివారం ఓ బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు.. గ్రామానికి చెందిన ఆదిశేషయ్య కుమార్తె భార్గవి(15) సమీపంలోని ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతోంది. దసరా సెలవుల నేపథ్యంలో ఇంట్లోనే ఉంటోంది. ఈ క్రమంలో ట్యూషన్‌కు వెళ్లకుండా ఆడుకుంటూ ఉండడంతో తండ్రి మందలించాడు. తర్వాత తన పనికి వెళ్లిపోయాడు. తండ్రి మందలించాడని మనస్తాపం చెందిన భార్గవి ఇంట్లోనే ఉరేసుకుంది. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శతక పద్యాల వ్యాప్తితో విజ్ఞాన సమాజం

తిరుపతి కల్చరల్: విజ్ఞాన సమాజాన్ని ఆవిష్కరించుకోవడానికి శతక పద్యాలలోని మానవీయ విలువలను బడి పిల్లల్లో వ్యాప్తి చేయాలని ఎస్కే యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య కె.వెంకటరెడ్డి తెలిపారు. తెలుగు భాషోద్యమ సమితి ప్రచురించిన ప్యాకెట్ సైజ్ వ్యక్తిత్వ వికాస పద్యాలు పుస్తకాన్ని ఎస్వీనగర్‌లోని ఆచార్య స్వగృహంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భగా ఆయన తెలుగు సాహిత్యంలోని శతకాలు, తెలుగు జాతికున్న గొప్పతనాన్ని తెలిపారు.


పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఆచార్య వెంకటరెడ్డి, తెలుగు భాషోద్యమ సమితి ప్రతినిధులు

తెలుగు భాషోద్యమ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సాకం నాగరాజు మాట్లాడుతూ వెంకటరెడ్డి కుటుంబం సౌజన్యంతో ముద్రించిన పదివేల శతక పద్యాల పుస్తకాలను బడిపిల్లల్లో పుస్తక పఠనాన్ని ప్రోత్సహించడానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు భాషోద్యమ సమితి ప్రధాన కార్యదర్శి టెంకాయల దామోదరం, సభ్యులు డాక్టర్ తమటం రామచంద్రారెడ్డి, పేరూరు బాలసుబ్రమణ్యం, బొందు రామచంద్రారెడ్డి, వాకా ప్రసాద్, ఎం.చంద్రారెడ్డి, ముంగర శశిధర్‌రాజు, వై.రమేష్‌బాబు, విజయ, కేశవులు పాల్గొన్నారు.

రమణీయం..కల్యాణ వెంకన్న రథోత్సవం


రథోత్సవంలో శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్న


రథోత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు, భక్తులు

తిరుపతి రూరల్ : తుమ్మలగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు కనులపండువగా సాగుతున్నాయి. ఆదివారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్నకు రథోత్సవం నిర్వహించారు. రాత్రి కల్కి అవతారంలో శ్రీవారు అశ్వవాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఉత్సవర్లను అలంకార మండపానికి వేంచేపు చేసి రథంపై కొలువుదీర్చారు భక్తుల గోవింద నామ స్మరణల నడుమ శ్రీవారు రథంపై విహరించారు. భక్తులు ఉప్పు, మిరియాలను రథంపై చల్లి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. నవరాత్రి బ్రహ్మోత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. స్వామి వారి వాహన సేవలో పాల్గొంటున్న భక్తులు మాడవీధుల్లో నడుస్తూ తన్మయత్వం చెందుతున్నారు. ఈ క్రమంలో తుమ్మలగుంట వాసులు దారి పొడవునా భక్తులకు తాగునీరు, మజ్జిగ, ప్రసాదాలు, ఎనర్జీ డ్రింక్స్ అందిస్తున్నారు. అలాగే వాహన సేవల్లో స్వామి వారికి ఊరేగింపుగా సారె తీసుకువచ్చి సమర్పిస్తున్నారు.

సారా స్వాధీనం. నిందితుడి అరెస్టు

చిత్తూరు అర్బన్: చిత్తపార అటవీ ప్రాంతం నుంచి విక్రయించేందుకు సారా తీసుకొస్తున్న గోవిందస్వామి(52) అనే వ్యక్తిని చిత్తూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) అర్బన్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. గుడిపాల మండలంలో ఎస్ఈబీ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. చిత్తపార అటవీ ప్రాంతం నుంచి సారా తీసుకొస్తున్న గోవిందస్వామిని పట్టుకుని, 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. పోలీసులను చూసి పారిపోయిన పొన్నుస్వామి అనే వ్యక్తిపై సైతం కేసు నమోదుచేసి గాలిస్తున్నట్లు సీఐ జోగేంద్ర తెలిపారు. అటవీ ప్రాంతంలో నిల్వ ఉంచిన 400 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐలు రాంప్రసాద్, బాబు, సిబ్బంది శంకర్, వెంకటేశ్వర్లు, జయశంకర్ పాల్గొన్నారు.


నిందితుడి అరెస్టు చూపుతున్న ఎస్ఈబీ పోలీసులు

చెరువులో పడి గొర్రెల కాపరి మృతి


కృష్ణప్ప మృతదేహం

పుంగనూరు: మండలంలోని చదళ్ల గ్రామంలో ఆదివారం ప్రమాదవశాత్తు చెరువులో పడి గొర్రెల కాపరి కృష్ణప్ప(55) మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. యథావిధిగా గొర్రెలు మేపుకునేందుకు వెళ్లిన కృష్ణప్ప మళ్లీ ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. ప్రమాదవశాత్తు చెరువు పడి పోయి ఉంటాడేమోనని అగ్నిమాపకశాఖకు సమాచారం అందించారు. ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు ఆధ్వర్యంలో సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని వెలికితీశారు. పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టమ్‌కు తరలించి, దర్యాప్తు చేస్తున్నారు.